
# వేటపాలెం సేవాశ్రమంలో స్టడీ టేబుల్స్ ప్రారంభం






**- విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ**

**వేటపాలెం, పెన్ పవర్, జూలై 10:**

వేటపాలెంలోని జీవికేసి స్వామి దయానంద సేవాశ్రమంలో విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం నూతనంగా ఏర్పాటు చేసిన స్టడీ టేబుల్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఆశ్రమ ట్రస్టీ గొల్లపూడి ఆకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టడీ టేబుల్స్‌ను ముఖ్య అతిథిగా హాజరైన పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఆశ్రమంలోని విద్యార్థులకు రాత పుస్తకాలు, హెల్త్ రికార్డు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి ఆరు లాంగ్ నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, స్వామి దయానంద సేవాశ్రమంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ట్రస్టీ గొల్లపూడి ఆకాష్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే విధంగా ప్రత్యేక స్టడీ టేబుల్స్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు ఒకరికి ఒకరు ఇబ్బంది కలగకుండా ఏకాగ్రతతో చదువుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను క్రమబద్ధంగా ఉంచుకోవడానికి, కేర్‌టేకర్లు విద్యార్థులను పర్యవేక్షించడానికి, వారాంతపు పరీక్షలు నిర్వహించడానికి కూడా ఈ టేబుల్స్ ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కావూరి కిరణ్ కుమార్, పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, సేవక్ సుబ్రహ్మణ్యం, లక్ష్మి, కృష్ణ, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి జూలై 31న కలెక్టరేట్ వద్ద ధర్నా: శీలమ్మ పిలుపు




**చీరాల, పెన్ పవర్, జూలై 10 :**

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ చీరాల నాయకురాలు శీలమ్మ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మరియంపేట యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్వాతి కిరణ్‌కు ధర్నా నిర్వహణపై సమాచారం అందజేస్తూ, ఆశా వర్కర్ల 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. శీలమ్మ మాట్లాడుతూ, గత ఏడు సంవత్సరాలుగా ఆశా వర్కర్ల వేతనాలు పెంచేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మార్చి 5న నిర్వహించిన "చలో విజయవాడ" కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వం 11 డిమాండ్ల పరిష్కారానికి అంగీకరించినప్పటికీ, ఐదు నెలలు గడిచినా సంబంధిత జీవోలు జారీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరల కారణంగా ఆశా వర్కర్లు కుటుంబాలను పోషించడం, పిల్లలను చదివించడం కష్టంగా మారిందని, అధిక పనిభారం వల్ల పలువురు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జూలై 31న కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో మరియంపేట యూపీహెచ్‌సీ పరిధిలోని ఆశా వర్కర్లందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శీలమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా నాయకులు ఆశాజ్యోతి, దీవెన కుమారి, బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

## చీరాల నియోజకవర్గంలో బరితెగించిన మద్యం మాఫియా.. నిబంధనలు బేఖాతరు

**చీరాల, పెన్ పవర్, జూలై 10 :**




చీరాల నియోజకవర్గంలో అక్రమ మద్యం విక్రయాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి నిర్ణయించిన సమయాలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీరాల పట్టణంతో పాటు వేటపాలెం మండలంలోని పలు ప్రాంతాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తూ బహిరంగంగానే మద్యం విక్రయిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. అధికారిక మద్యం దుకాణాలు మూసివేసిన తర్వాత కూడా బెల్ట్ షాపుల ద్వారా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో యువతతో పాటు సాధారణ ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ మద్యం విక్రయాలపై ఇప్పటికే పలు సందర్భాల్లో మీడియాలో కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, బెల్ట్ షాపుల నిర్వహణను పూర్తిగా అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మద్యం విక్రయాలపై స్పష్టమైన నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు సరిగా జరగడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## చిలకలూరిపేట - నరసరావుపేట మార్గంలో ఆటో, లారీ ఢీ.. వృద్ధుడికి తీవ్రగాయాలు

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 10 :**






కొండ్రుపాడు : చిలకలూరిపేట – నరసరావుపేట ప్రధాన రహదారిపై చిన్న కొండ్రుపాడు సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అకస్మాత్తుగా ఎడమవైపు మలుపు తీసుకున్న ఓ టిప్పర్ లారీని, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో అదుపుతప్పి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న 8 మందిలో కావూరుకు చెందిన కోడే రామకృష్ణ అనే వృద్ధుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే కోమాలోకి వెళ్లారు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా ఆయన్ను చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## న్యూ జీజీహెచ్‌ను రాష్ట్రంలోనే నెం.1 ఆసుపత్రిగా నిలపాలిజిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ, పెన్ పవర్, జూలై, 10,**

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శుక్రవారం విజయవాడ న్యూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (న్యూ జీజీహెచ్)లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ వార్డులు, ఐసీయూలు, ఔషధ పంపిణీ కేంద్రం, పారిశుద్ధ్యం, రోగులకు అందుతున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వైద్యులు, అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి సంతృప్తి చెందేలా సేవలందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని అన్నారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ సకాలంలో, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగుల నుంచి ఆసుపత్రిపై అత్యుత్తమ ఫీడ్‌బ్యాక్ వచ్చేలా వైద్యులు, సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని సూచించారు. రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, వారి సమస్యలను ఓర్పుతో వినడం, చికిత్సలో ఎలాంటి జాప్యం లేకుండా చూడడం ద్వారా ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని అన్నారు. న్యూ జీజీహెచ్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వ ఆసుపత్రిగా, నెం.1 ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రతి అధికారి, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల ప్రశంసలు పొందాలని సూచించారు. వైద్య, సంబంధిత సేవలు అందించడంలో ఆసుపత్రిలో ఎక్కడా నిర్లక్ష్యం, నిర్లిప్తతకు తావులేకుండా సేవలందించాలని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో చిన్నపాటి అలసత్వాన్ని కూడా సహించబోమని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ తనిఖీల సందర్భంగా ఆసుపత్రిలో చేరిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది వ్యవహారశైలిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందే విధంగా సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.రఘునందన్, ఆసుపత్రి పరిపాలన అధికారి కె.అప్పారావు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో ఎన్నికల అధికారుల సమావేశం

**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 10 :**



చిలకలూరిపేట :ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం పేట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలకు సంబంధించిన పలు అంశాలపై ఎన్నికల అధికారి వివరించారు. సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు తమకు ఉన్న సందేహాలు, అనుమానాలను ఎన్నికల అధికారిని అడిగి నివృత్తి చేసుకున్నారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ సహకరించాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు.

## ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ పై ప్రజల్లో భయాలను పోగొట్టాలి: కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం. రాధాకృష్ణ

**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 10 :**




చిలకలూరిపేట : దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కార్యక్రమంపై ఓటర్లలో నెలకొన్న అపోహలను, భయాలను ఎన్నికల సంఘం తక్షణమే తొలగించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం. రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ, ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

**ప్రజాధనం ఆదా చేయొచ్చు..**

ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం దేశవ్యాప్తంగా సుమారు పదివేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారని ఆయన తెలిపారు. దేశంలో మొత్తం 99 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటికే 70 కోట్ల మంది తమ ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నారని గుర్తుచేశారు. మిగిలిన 29 కోట్ల మందికి కూడా ఆధార్ లింక్ ప్రక్రియను పూర్తి చేస్తే, ఒకరికి ఒకే చోట ఓటు ఉంటుందని, దీనివల్ల దొంగ ఓట్లను అరికట్టడమే కాకుండా వేలాది కోట్ల రూపాయల ఖర్చును ఆదా చేయవచ్చని ఆయన సూచించారు.

**పేదల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం..**

ఈ సవరణ ప్రక్రియలో కొన్ని సామాజిక వర్గాల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తారనే ఆందోళన ప్రజల్లో ఉందని రాధాకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యంగా సొంత ఇల్లు లేని పేదలు, అద్దె ఇళ్లలో నివసించే వారు తరచూ ఇళ్లు మారుతుంటారని, కేవలం డోర్ నంబర్ మారినంత మాత్రాన వారి ఓటు హక్కును ఎలా తీసేస్తారని ఆయన ప్రశ్నించారు. అలాగే తండ్రి పేరు బదులు భర్త పేరు నమోదు కావడం, పుట్టిన తేదీల్లో తప్పులు దొర్లడం వంటి చిన్న చిన్న పొరపాట్లను ఆధార్ అనుసంధానం ద్వారా సులభంగా సరిదిద్దవచ్చన్నారు. గతంలో బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో భారీగా ఓట్లు గల్లంతైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

**బయోమెట్రిక్ విధానం అమలు చేయాలి..**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ప్రజలకు కల్పించిన సార్వభౌమాధికారమైన 'ఓటు హక్కు'ను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. బూత్ లెవెల్ అధికారులు కూడా చిన్న పొరపాటు జరిగితే తమ ఉద్యోగాలకు ఎక్కడ ముప్పు వస్తుందోనని భయాందోళనల మధ్య పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తే ఫేక్ ఓట్లకు పూర్తిగా చెక్ పెట్టవచ్చని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు ఇస్తున్న సలహాలు, సూచనలను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోవాలని, పారదర్శకంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు.

## దాసరి కాలనీ కనకదుర్గ అమ్మవారి తిరునాళ్లలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

**చిలకలూరిపేట, పెన్ పవర్, జూలై 10 :**



చిలకలూరిపేట : పట్టణంలోని దాసరి కాలనీలో వెలసిన కనకదుర్గ అమ్మవారి 32వ తిరునాళ్ల మహోత్సవాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఆలయానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, పూలాభిషేకం, దుర్గా హోమం, పూర్ణాహుతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.